క్లుప్తంగా

విశాఖరేంజ్ డీఐజీని కలిసిన ఎస్పీ



విశాఖరేంజ్ డీఐజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: విజయనగరం జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వకుల్ జిందాల్ అదనపు ఎస్పీ అస్మాఫర్హీన్‌తో కలిసి విశాఖరేంజ్ డీఐజీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గోపీనాథ్ జెట్టిని విశాఖ రేంజ్ కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రేంజ్ అధికారులతో డీఐజీ మమేకమై జిల్లాలకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు.

నేడు కొండకరకాం గ్రామ సందర్శన

విజయనగరం రూరల్: మండలంలోని కొండకరకాం గ్రామ సందర్శన కార్యక్రమం గురువారం నిర్వహిస్తామని ఎంపీడీఓ గంటా వెంకటరావు బుధవారం తెలిపారు. మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో మండల శాఖ అధికారులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

కషాయాలతో చీడపీడల నివారణ



దశపత్ర కషాయం తయారీని రైతులకు వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

వేపాడ: సేంద్రియ సాగు పద్ధతులపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని వావిలపాడు గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ సన్యాసమ్మ ఆధ్వర్యంలో సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. పంటలను ఆశించే వివిధ చీడపీడల నివారణకు ఉపయోగించే కషాయాలను ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. రసాయన ఎరువుల వినియోగం వల్ల కలిగే నష్టాలను తెలియజేశారు. సేంద్రియ ఎరువులు, కషాయాల వినియోగంతో తక్కువ పెట్టుబడితో అధిక పంట దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జిలు రాము, దేముడు, పలువురు రైతులు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ



దోమల మందు పిచికారీ చేయిస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు

గుర్ల: మండలంలోని భూపాలపురంలో బుధవారం దోమల నివారణ మందును స్ప్రేయింగ్ చేశారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబల కుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు తెలిపారు. కాలువల్లో పూడికలు తొలగించడంతో పాటు మంచినీటి వనరులను క్లోరినేషన్ చేశామన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలను కోరారు.

78 మందికి కంటి పరీక్షలు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాల్మిక్ ఆఫీసర్ జాన్

లక్కవరపుకోట: మండలంలోని భీమాళి గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో విశాఖపట్నంకు చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీపీ ఎం.శ్రీనురాజు శిబిరాన్ని ప్రారంభించారు. ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆప్తాల్మిక్ ఆఫీసర్ జాన్ 78 మందికి కంటి పరీక్షలు చేశారు. వివిధ నేత్ర సమస్యలతో బాధపడుతున్న 22 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వారికి ఫౌండేషన్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయడంతో పాటు మందులు, కళ్లద్దాలు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొయ్యాన కృష్ణ, క్యాంప్ మేనేజర్ అరుణ్‌కుమార్, నర్సింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట మారుతీనగర్ కాలనీకి చెందిన మహిళ(23) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో గజపతినగరం పోలీస్ స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోద చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పచ్చిరొట్ట సాగుతో నేల సారవంతం

- రసాయన ఎరువులతో చౌడుబారుతున్న నేలలు
- పచ్చిరొట్ట పంటల సాగుతో పొలానికి పునరుజ్జీవం
- భూసార పరిరక్షణపై రైతుల్లో చైతన్యం



పూసపాటిరేగలో పచ్చిరొట్ట సాగు

పూసపాటిరేగ: వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో రైతులు మోతాదుకు మించి రసాయన ఎరువులు, పురుగుమందులను వినియోగిస్తున్నారు. దీని వల్ల సాగు ఖర్చులు పెరిగిపోవడంతో పాటు నేలలో చౌడు శాతం క్రమేపి పెరిగిపోయి నేల నిస్సారంగా మారుతుంది. రైతులు రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ సాగు పద్ధతులపై దృష్టి సారించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. లేదంటే భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సేంద్రియ సాగు విధానాన్ని ప్రోత్సహించేందుకు వ్యవసాయశాఖ ద్వారా రాయితీపై పచ్చిరొట్ట పంటలైన జీలుగు, పిల్లిపెసర, జనుము, తదితర విత్తనాలను అందిస్తున్నారు. పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతంగా మారుతుంది.

పూసపాటిరేగ మండలంలోని తీర ప్రాంతంలో కొబ్బరి తోటలు అధికంగా సాగులో ఉన్నాయి. ఇక్కడి నేల స్వాభావం, ఏటా ఒకే రకమైన పంట సాగుతో క్రమంగా నేల సారం కోల్పోతోంది. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు రైతులు తమ పొలంలో పచ్చిరొట్ట పంటలు సాగు చేస్తున్నారు. చౌడువాడ, పూసపాటిరేగ, పతివాడ, చినపతివాడ, రాయుడుపేట, కృష్ణాపురం, రోలుచప్పిడి, కుమిలి, కోనయ్యపాలెం, చింతపల్లి గ్రామాల్లో రైతులు పచ్చిరొట్ట సాగుకు ముందుకొచ్చారు. పంట విరామ సమయంలో పొలాన్ని దుక్కిచేసి పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవాలి. 45 రోజుల తరువాత పూత దశకు వచ్చిన పంటను పొలంలో కలియదున్నాలి. పంట కుళ్లిపోయి అందులోని ఖనిజలవణాలు, పోషకాలు భూమిలోకి చేరి నేల సారవంతం అవుతుంది.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..

పచ్చిరొట్ట పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వ్యవసాయశాఖ ద్వారా జీలుగు, జనుము, పిల్లిపెసర విత్తనాలను రాయితీపై సరఫరా చేస్తున్నాం. పచ్చిరొట్ట సాగుతో మంచి ఫలితాలు రావడంతో సాగు మరంత పెరిగింది. పచ్చిరొట్ట సాగు చేసిన పొలంలో తరువాత వేసిన పంటలు ఎటువంటి ఎరువులు వేయకుండానే అధిక దిగుబడులు వస్తాయి.

– కొల్లి నీలిమ, మండల వ్యవసాయాధికారి, పూసపాటిరేగ

నిరుపేదలకు ఆర్థిక సహాయం స్ఫూర్తిదాయకం



అనాథ పిల్లలతో ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

- ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిండం సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. ఏబీ చారిటబుల్ ట్రస్టు కణపాక యూత్ హాస్టల్‌లోని విద్యార్థులకు బుధవారం ఆర్థిక సాయంతో పాటు ఉచిత వైద్యసేవలు అందించింది. సివియర్ ప్రాంకి అనీస్ వ్యాధిగ్రస్తుడు కె.పవన్‌కుమార్‌కు రూ.10వేలు, లవ్ అండ్ లైట్ అనాథ పిల్లల హాస్టల్‌కు నిత్యావసర సరుకుల కోసం రూ.20 వేలు డీవీజీ చేతుల మీదుగా ట్రస్టు సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ ఎం.ఎస్.స్వరూప్, యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, అమ్మ సొసైటీ ట్రెజరర్ పురుషోత్తం, ట్రెజరీ అధికారి సురేష్‌కుమార్, ఏపీ హ్యూమన్ రైట్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి పొంద్రంకి సంతోష్‌కుమార్, జైహనుమాన్ అశ్విని మార్షల్ ఆర్ట్స్ వైస్ ప్రెసిడెంట్ పెంకి అశ్విని, ఎం.అప్పారావు, వెలుగు మణి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్‌ను కాపాడుకుందాం

- జేవీవీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంవీఆర్‌కృష్ణాజీ



సత్కారం పొందుతున్న జేవీవీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంవీఆర్‌కృష్ణాజీ

విజయనగరం అర్బన్: వేల కోట్ల రూపాయల లాభాల్లో ఉండే బీఎస్‌ఎన్‌ఎల్ టెలికాం సంస్థ పునర్వైభవానికి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని జనవిజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ కోరారు. సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ పౌరులపై ఉందన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లాశాఖ ఆధ్వర్యంలో గురుజాడ పాఠశాలలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని పబ్లిక్ సంస్థల మనుగడను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులు కృష్ణాజీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎ.ఆనంద్, ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, జాతీయ సహాయ కార్యదర్శి డాక్టర్ పైల రమేష్, గంధ్రేటి అప్పలనాయుడు, శ్రీను, జిల్లా కోశాధికారి రమేష్, నగర ప్రధాన కార్యదర్శి పి.షణ్ముఖరావు, రాజగోప్, సత్యనారాయణ, టి.పైడినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు భరోసాగా వన్‌స్టాప్ సెంటర్

- వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ రమాదేవి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న రమాదేవి, అనిత

విజయనగరం ఫోర్ట్: పని ప్రదేశాల్లో మహిళలు వేధింపులకు గురైతే వెంటనే వన్ స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించాలని ఆ సెంటర్ కౌన్సిలర్ రమాదేవి కోరారు. పట్టణంలోని ఉడాకాలనీలోని మహిళలకు బుధవారం వన్‌స్టాప్ సెంటర్ పనితీరు, సేవలపై అవగాహన కల్పించారు. గృహ హింసకు గుపైన మహిళలు టోల్ ఫ్రీ నంబర్ 181ను సంప్రదించాలన్నారు. రక్షణ, సంరక్షణ, న్యాయ, వైద్య సహాయం వన్‌స్టాప్ సెంటర్‌ద్వారా బాధిత మహిళలకు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కేస్ వర్కర్ టి.అనిత, పారా మెడికల్ వర్కర్ బి.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

● ప్రారంభమైన వరినాట్లు



చలుమూరివానిపాలెంలో వరినాట్లు వేస్తున్న మహిళలు

వేపాడ: మండలంలో గత కొద్దిరోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఖరీఫ్ వరినాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు. ఇన్నాళ్లూ వర్షాలు లేకపోవడంతో వరినారు ఎండిపోతోందని ఆందోళన చెందిన రైతులకు ఇటీవల కురిసిన వర్షం ఊరటనిచ్చింది. చెరువులు, కాలువల్లో నీరు చేరడంతో వరినాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. నల్లబిల్లి, చలుమూరివానిపాలెం, తదితర గ్రామాల్లో బుధవారం పలువురు రైతులు వరినాట్లు వేస్తూ కనిపించారు.

● హరివిల్లు కనువిందు



మెరకముడిదాం మండలంలోని సోమలింగాపురం వద్ద బుధవారం సాయంత్రం ఆకాశంలో హరివిల్లు కనిపించింది. సప్తవర్ణాల ఈ హరివిల్లు చూపరులకు కనువిందు చేసింది. - మెరకముడిదాం

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు



వేపాడ: వేపాడలో స్వామివారికి జలాభిషేకం చేస్తున్న ఆలయ ధర్మకర్త ప్రసాద్



బొండపల్లి: దేవుపల్లిలోని రాజరాజేశ్వరి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



కొత్తవలస: కుమ్మరివీధిలోని కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం చేస్తున్న పురోహితులు



గజపతినగరం: ఏకాదశి పూజలో పాల్గొన్న భక్తులకు హారతిస్తున్న అర్చకులు శ్రీనివాసా చార్యులు

ఆషాఢ శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశిగా పిలుస్తారు. ఇది హిందువులకు ఎంతో పవిత్రమైన రోజు. పురాణాల ప్రకారం శ్రీమహావిష్ణువు ఈ రోజు నుంచి నాలుగు నెలల పాటు క్షీరసాగరంలోని శేషతల్పంపై నిద్రిస్తారని అంటారు. అందుకే తొలి ఏకాదశిని శయన ఏకాదశి అని కూడా పిలుస్తారు. ఈ రోజున శ్రీమహావిష్ణువును భక్తిశ్రద్ధలతో పూజిస్తే మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో బుధవారం వేకువ జాము నుంచి భక్తులు ఆలయాలకు పోటెత్తారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. జై శ్రీమన్నారాయణ నామసర్మరణతో ఆలయాలు మార్మోగాయి. గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్

ఉమా ఆశయాలు కొనసాగిద్దాం



సంతాపసభలో మాట్లాడుతున్న ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్

- ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్

నెల్లిమర్ల: ఇఫ్టూ నాయకుడు, దివంగ ఉరిటి ఉమామహేశ్వరరావు ఆశయాలు కొనసాగించాలని రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక ఇఫ్టూ అమర కార్మికుల భవనంలో బుధవారం ఉమామహేశ్వరరావు సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతర ప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నెల్లిమర్లలో ఇఫ్టూ స్థాపనకు ఉమా కృషిచేశారన్నారు. ఆయన భార్య, పిల్లలు కూడా కార్మిక ఉద్యమంలో పాల్గొని పోరాటాలు చేశారన్నారు.
సంతాప సభలో ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు గోపాలం, జిల్లాప్రధాన కార్యదర్శి గీత, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, నగర పంచాయతీ వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, గంటా అప్పలరాజు తదితరు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీలు అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం టౌన్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు అన్నారు. మాతాబుజ్జి క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు, పదోతరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు కణపాకలో బుధవారం బహుమతులు అందజేశారు. వారి తల్లిదండ్రులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గెలుపోటములు సమానంగా తీసుకునే శక్తి కేవలం ఆటల వల్లే అలవడుతుందన్నారు. కార్యక్రమంలో ఐవీపీ రాజు, రాజేష్‌వర్మ, కర్రోతు నరసింగరావు, ప్రసాదుల ప్రసాద్, అనూరాధా బేగం, కంది మురళీనాయుడు, అవనాపు విజయ్, బాలు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఘంటసాల సినీ సంగీత విభావరి



ఆపాతమధురాలను ఆలపిస్తున్న గాయికులు

విజయనగరం టౌన్: ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఆనందగజపతి ఆడిటోరియం ఆవరణలో బుధవారం రాత్రి నిర్వహించిన ఘంటసాల సినీ సంగీత విభావరి ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకుంది. ఘంటసాల ఆపాత మధురాలను వర్ధమాన గాయనీ, గాయకులు ఆలపించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభా కార్యక్రమంలో కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు మాట్లాడుతూ నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని కేవలం చిన్నారులకు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఆ రోజు నిర్వహించే కార్యక్రమంలో శిక్షణ తీసుకున్న చిన్నారులతోనే అన్నిరకాల వాయిద్యాలు, సంగీత కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ గురువారం నుంచే సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాపీఠం అధ్యక్షుడు గ్రంధి విష్ణుమూర్తి, నాలుగెస్సుల రాజు, కాపుగంటి ప్రకాష్, వైవీవీ సత్యనారాయణ (అబ్బులు), తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 27 నుంచి 'శ్రీరామాయణ శంఖారావం'



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిరంజీవి

విజయనగరం రూరల్: రామాయణం మహాకావ్యం ఆవశ్యకతను భావితరాలకు అందించాలనే సదుద్దేశంతో విజయనగరం జిల్లా కేంద్రం శివారు, ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణం ప్రాంగణంలో సెప్టెంబర్ 27 నుంచి 29 వరకు మూడు రోజులపాటు 'శ్రీరామాయణ శంఖారావం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎన్‌సీఎస్ ట్రస్టీ నారాయణం నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్, ప్రోమో వీడియాను సినీ హీరో, పద్మభూషణ్ కె.చిరంజీవి చేతుల మీదుగా ఆయన నివాసంలో ఆవిష్కరించినట్టు పేర్కొన్నారు.

చినుకు పడితే అంతా చీకటే!

మెరకముడిదాం: మండలంలో ఎప్పుడు, ఎక్కడ చినుకు పడినా విద్యుత్ సరఫరా నిలిచిపోతుండడంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో గర్భాం, సోమలింగాపురం, గరుగుబిల్లి గ్రామాల్లో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయి. అక్కడ నుంచి అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. అయితే ఏ ప్రాంతంలో అయినా చిన్నపాటి వర్షం కురిస్తే విద్యుత్ సిబ్బంది వెంటనే సరఫరాను నిలిపివేస్తున్నారు. రాత్రి సమయంలో గంటల తరబడి సరఫరా నిలిపివేస్తుండడంతో దోమలతో అవస్థలు పడుతున్నామని గగ్గోలు పెడుతున్నారు. ఎప్పటికప్పుడు సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మెంటినెన్స్ పేరుతో గంటల తరబడి సరఫరా నిలిపివేస్తున్నారని, దీనికి తోడు చిన్న చినుకు పడినా కూడా సరఫరా నిలిపివేస్తుంటే విద్యుత్ కనెక్షన్ ఉండి ఏం ఉపయోగమని మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఉపాధి వేతనాలు తక్షణమే చెల్లించాలి



రైతులతో కలిసి కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

లక్కవరపుకోట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారులకు బకాయి వేతనాలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని సీఐటీయూ నాయకుడు గాడి అప్పారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో స్థానిక విలేకరలతో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఉపాధి వేతనదారులకు 10 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారంతా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే పని కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే జాబ్‌కార్డు మంజూరు చేసి పని కల్పించాలని అన్నారు. చెరువు గట్టుల పటిష్టత, పంట కాలువల్లో పూడికతీత పనులు వేతనదారులతో చేయించాలని కోరారు.

కరపత్రం విడుదల

దేవాదాయ ధర్మాదాయ భూముల సాగుదారులు, కౌలురైతుల సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 20న విజయనగరం జిల్లా కేంద్రంలో నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు గాడి అప్పారావు, తరిణి వెంకటరమణ, బొట్టా రాములు కోరారు. ఈ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను లక్కవరపుకోట గ్రామ రైతులతో కలిసి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గతంలో దేవాదాయశాఖకు చెందిన భూములను మూడు సంవత్సరాలకు కౌలుకి ఇచ్చేవారని, ప్రస్తుతం ఈ భూములను వేలం వేయడం ద్వారా పేదరైతులు అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వం నుంచి సాగు చేస్తున్న రైతులకు సంబంధించి కౌలు పత్రాలు జారీ చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.